క్లుప్తంగా

వైద్యులకు వైద్య సిబ్బంది మద్దతు



సి.బెళగల్ పీహెచ్‌సీలో డాక్టర్లకు మద్దతుగా నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

సి.బెళగల్: పీహెచ్‌సీలలో పనిచేస్తున్న డాక్టర్లు చేపట్టిన సమ్మెకు పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది మద్దతుగా నిలిచారు. పీహెచ్‌సీ డాక్టర్లు తమ డిమాండ్‌ల సాధనకు గత కొన్ని రోజులుగా వివిధ స్థాయిలలో నిరసన కార్యక్రమాలను చేపట్టిన విషయం విధితమే. వారి నిరసనకు మంగళవారం మండల కేంద్రం సి.బెళగల్ పనిచేస్తున్న వైద్య సిబ్బంది సంఘీభావంగా నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో పీహెచ్‌సీలో నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఉమామహేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ మంగమ్మ, హెచ్‌ఈ పుష్పావతి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆడ పిల్లలను చదివించుకోవాలి



చదువు ప్రాముఖ్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కోడుమూరు రూరల్ : తల్లిదండ్రులు ఆడపిల్లలను చక్కగా చదివించుకోవాలని.. చదవుతోనే బాలికలకు మంచి భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, జరీనాబాను అన్నారు. మంగళవారం గూడూరు హైస్కూల్లో బాలికల రక్షణ- బాలికల చదువు యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థినులకు ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు చిన్న వయస్సులో పెళ్లి చేయకుండా యుక్తవయసు వచ్చే వరకు చదివించుకోవాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేయాలని చూస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఎం కార్యదర్శి మృతి



ఇబ్రహీం మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా సీపీఎం నాయకులు

సి.బెళగల్: మండల కేంద్రానికి చెందిన సీపీఎం మండల కార్యదర్శి ఇబ్రహీం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి మోహన్ తదితరులు మంగళవారం సి.బెళగల్లోని మృతుడి ఇంటికి చేరుకుని, మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


జీఎస్టీ తగ్గింపుతో నిర్మాణ రంగానికి ఊతం



సిమెంట్ ధరలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: జీఎస్టీ స్లాబ్‌ల మార్పు నిర్మాణ రంగానికి ఊతమిస్తుందని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. మంగళవారం అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి మండల కేంద్రం సి.బెళగల్‌లో జీఎస్టీ తగ్గుదలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నిర్మాణ రంగంలో కీలకంగా ఉన్న, సిమెంట్, హార్డ్ వేర్ విక్రయాల దుకాణాలకు వెళ్లి ధరల మార్పులను ప్రజలకు తెలియజేశారు. జీఎస్టీలో సిమెంట్ 27 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడంతో దాదాపు బస్తాపై రూ.30 వరకు ఆదా అవుతున్నాయని, గృహనిర్మాణ దారులు సద్వినియోగం చేసుకువాలరు.

పాఠశాలకు కుర్చీల విరాళం



గడివేముల జెడ్పీ స్కూల్ హెచ్‌ఎంకు కుర్చీలను అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

గడివేముల: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలకు పూర్వ విద్యార్థులు 20 కుర్చీలను విరాళంగా అందజేశారు. ఇదే పాఠశాల 1994-1999 బ్యాచ్‌కు చెందిన వారందరూ కలిసి ఇటీవల పాఠశాలలో ఆత్మీకసమ్మేళనం నిర్వహించుకున్నారు. వారందరూ కలిసి మంగళవారం హెచ్‌ఎం శ్రీనివాసులకు అందజేశారు. పాఠశాలకు తమవంతు సహాయసహకారాలు ఉంటాయని పూర్వవిద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో రామక్రిష్ణ, వేణు, వలి, బాషా తదితరులు పాల్గొన్నారు.

వరి వర్షార్పణం

- వర్షాలకు దెబ్బతిన్న వరి
- మరో వారం రోజుల్లో కోతలు
- చేతికొచ్చిన పంట నీటి పాలు
- కన్నీటి పర్యంతమవుతున్న రైతులు



కొండజుటూరులో నెలకొరిగిన వరి పైరు

పాణ్యం : మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి వరి పంట నేలపాలయ్యింది. నాలుగైదు రోజుల్లో ఇంటికి రావాల్సి పంట నీటి పాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆరుగాలం కష్టించిన రైతులకు కన్నీరే మిగిలింది. ఎడాపెడా కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు తడుస్తూనే ఉన్నాయి. సోమ, మంగళ వారాల్లో కురిసిన భారీ వర్షాలకు వరి పంట నేలకొరిగింది. ఉదయాన్నే పొలాల్లో పడివున్న వరి పైరును చూసిన రైతులు తీవ్ర ఆవేదన గురయ్యారు. ఎన్నడూ విధంగా ఈ సారి వరిని అతి కష్టం మీద సాగుచేశారు. ప్రభుత్వం సృష్టించిన ఎరువుల కొరతను అధిగమించిన రైతులు చివరికి ప్రకృతి ప్రకోపానికి గురికాక తపపలేదని ఆవేదన చెందుతున్నారు.

ఎకరానికి రూ.50వేలు పెట్టుబడి

మండలంలో 6 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరానికి రూ. 50వేల వరకు పెట్టుబడులు పెట్టారు. దీనికి తోడు రైతులకు ప్రభుత్వం సకాలంలో యురియా సరఫరా చేయకపోవడంతో బ్లాక్ మార్కెట్‌లో కొని పైర్లను కాపాడుకున్నారు. అత్యంత కష్టం మీద సాగు చేసిన రైతులకు మరో వారం రోజులు, కొన్ని చోట్ల నాలుగైదు రోజుల్లో వరి పైరు కోతకు రావాల్సి ఉంది. అయితే సోమవారం సాయంత్రం, మంగళవారం కురిసిన వర్షాల ధాటికి చేతికొచ్చిన వరి పంట నీటిపాలయ్యింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. చేసేదేమి లేక రైతులు నీటిలో పడి ఉన్న పంటలను కట్టలు కట్టి వదిలేస్తున్నారు. కొండజుటూరు, గోరుకల్లు, పాణ్యం, కిలకల తదితర గ్రామాల్లో దాదాపు 200 ఎకరాలకు పైగా వరి పంట దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



పడిపోయిన వరిపైరును కట్టలు కడుతున్న కూలీలు

చంద్రబాబు కుట్రలను ప్రజలకు వివరించాలి



కోటి సంతకాల సేకరణపై నాయకులతో చర్చిస్తున్న ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్

- కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయండి
- వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్ : రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ పేరుతో నాణ్యమైన వైద్యాన్ని, వైద్య విద్యను పేదలకు దక్కకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న కుట్రలను ప్రజలందరికీ వివరించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం కర్నూలు మండలంలోని గార్గేయపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ అధ్యక్షులు మోహన్‌బాబు, కోటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే.. సీఎం చంద్రబాబు వాటిని పూర్తి చేయలేక పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి సంతకాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి మధుశేఖర్, మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి రియాజ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అజీవుల్లా, చంద్రశేఖర్ రావు, నాగిరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబహాన్, వినాయక నాయుడు, జాకీర్, తిమ్మారెడ్డి, శివరాం రెడ్డి, సయ్యద్‌బాషా, సర్వేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి, యేసన్న తదితరులు పాల్గొన్నారు.

సర్వజీవ హితం కోరేది హిందుత్వం



మాట్లాడుతున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

ఓర్వకల్లు : సృష్టిలోని సమస్త జీవరాశుల హితాన్ని కోరేది హిందుత్వం మాత్రమేనని, హిందుత్వమంటే మహోన్నతమైన జీవన విధానమని టీటీడీ దేవస్థానముల హిందూ ధర్మప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలపాడులోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఐదు రోజుల పాటు జరిగే ధార్మిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. స్థానిక భజన మండలి వారిచే భజన కార్యక్రమాలు, తెలుగు పండితులు గరుడాద్రి వనజకుమారి శ్రీమద్రామాయణంపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అయ్యస్వామి, అయ్యన్న, లలితమ్మ, భజనమండలి అధ్యక్షులు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో సమస్యల తిష్ట

కల్లూరు : కల్లూరు అర్బన్ 33వ వార్డు కల్లూరు, చెంచునగర్ కాలనీలో సమస్యలు తిష్టవేశాయని సీపీఎం నాయకులు సుధాకరప్ప, హుస్సేన్ బాషా అన్నారు. మంగళవారం సీపీఎం ప్రతినిధి బృందం 33వ వార్డులోని కాలనీలో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. డ్రైనేజీలు పాడైపోయి మురుగు నీరు ఎక్కడికక్కడ నిలబడడంతో దుర్గంధం వస్తుందన్నారు. కాలనీలో వీధి లైట్లు సరిగ్గా వెలగడం లేదని, దీంతో రాత్రి వేళలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

అధికారులు కాలనీలో రోడ్లు, కల్వర్టులు పగలగొట్టి అలాగే వదిలేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోవిందు, శ్రీనివాసులు, రామచంద్రుడు, రాము తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

కర్నూలు: కర్నూలు మండలం ఉల్చాల గ్రామం వైపు వెళ్లే రోడ్డులో ఆదిత్య నగర్ సమీపాన రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో పడి ఉండగా స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించారు. బాధితుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి వయస్సు దాదాపు 50 ఏళ్లు ఉంటుంది. చామన చాయ వర్ణంలో ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసినవారు 94412 90736 లేదా 91211 01062 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ విక్రమ సింహా విజ్ఞప్తి చేశారు.

తమ్మరాజుపల్లెకు విద్యార్థి బస్సు

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామానికి ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు విద్యార్థి బస్సు కేటాయించారు. మంగళవారం గ్రామానికి చేరుకున్న బస్సుకు విద్యార్థులు, ప్రజా సంఘ నాయకులు, గ్రామస్తులు పూజలు చేశారు. గ్రామం నుంచి సుమారు 60 మంది వరకు ఏపీ మోడల్ స్కూల్, ఇంటర్ ప్రభుత్వ కళాశాలకు వెళ్తున్నారు. అయితే ప్రస్తుతం బస్సులు కిటకిటలాడుతుండడంతో విద్యార్థులు సకాలంలో పాఠశాల, కళాశాలకు వెళ్లలేకపోతున్నారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ విజయగౌరి వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు గ్రామానికి ప్రత్యేకంగా విద్యార్థి బస్సు కేటాయించారు. కార్యక్రమంలో పి. సురేంద్ర, రామకిట్టు, లక్ష్మీనారాయణ, నాగేష్ తదతరులు పాల్గొన్నారు.



గ్రామానికి వచ్చిన విద్యార్థి బస్సుతో విద్యార్థులు, ప్రజాసంఘ నాయకులు

సమస్యల నిలయంగా రాజీవ్ గృహకల్ప



రాజీవ్‌గృహకల్పలో చెత్తను చూపిస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 36వ వార్డు పరిధి పెద్దపాడు రోడ్డులో ఉన్న రాజీవ్ గృహకల్ప సమస్యల నిలయంగా మారిందని సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సీపీఐ నాయకులు రాజీవ్ గృహకల్పలోని ఇళ్లను, పరిసరాలను పరిశీలించారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గృహకల్పలో సుమారు 1500 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. గృహాలు శిథిలావస్థకు చేరాయన్నారు. కొన్ని అంతుస్తుల్లో నీళ్ల ట్యాంకులు పగిలిపోయాని తెలిపారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెత్తా చెదారం పేరుకొని దుర్వాసన వెదజల్లుతోందన్నారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందన్నారు. అధికారులు స్పందించి రాజీవ్‌గృహకల్ప సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రామాంజనేయులు, కాలనీవాసులు చంద్ర, రాముడు, ఖలీల్, హుస్సేన్, పీరా, విజయ్, మక్బుల్ బాషా, నూరి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో జ్ఞాన జ్యోతి వెలిగించాలి

ఓర్వకల్లు : దీపావళి పండుగ రోజున ప్రతి ఇంట్లో జ్ఞాన జ్యోతి వెలిగించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని మిడుతూరు మండలం, చింతలపల్లె ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గుట్టపాడు, ఉప్పలపాడు గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ''గురువు తన జ్ఞానాగ్నితో శిష్యుల తలలో జ్ఞానజ్యోతిని వెలిగించి సరైన మార్గంలో నడిపిస్తాడు'' అనుటకు ప్రజలు దీపావళి రోజున ప్రతి ఇంట్లో దీపాలు వెలిగిస్తారని తెలిపారు. అనంతరం ప్రజలకు కరదీపికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, సంజీవ, నాగమద్దిలేటి, నాగశేషన్న, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.



గుట్టపాడులో కరదీపికలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో చంద్రబాబు దిట్ట

- నకిలీ మద్యం రాష్ట్ర వ్యాప్తంగా ఏరులై పారుతోంది
- నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేయాలి
- విలేకరుల సమావేశంలో నగర మేయర్ బీవై రామయ్య



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కల్లూరు: డైవర్షన్ పాలిటిక్స్ చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిట్ట అని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులైపారుతోందని, రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందని విమర్శించారు. మంగళవారం గణేష్ నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏరులై పారుతున్న నకిలీ మద్యంపై చంద్రబాబు నాయుడు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ మద్యం కేసును కూటమి ప్రభుత్వం, చంద్రబాబు డైవర్షన్ చేస్తున్నారని మండిపడ్డారు. నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పజెప్పి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. 2024 ఎన్నికల్లో తంబళ్లపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్రారెడ్డికి నకిలీ మద్యం నిందితుడు జనార్దన్‌రావు అత్యంత సన్నిహితుడనే విషయం అందరికి తెలుసన్నారు. నకిలీ మద్యం రాకెట్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంటగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జనార్దన్ రావును పావుగా చేసుకొని వైఎస్సార్‌సీపీపై బురద చల్లుతున్నారన్నారు.

సిట్ పేరుతో సాక్షులతో కట్టు కథలు..

సీబీఐ విచారణ కాలయాపన చేస్తారనే సాకుతో చంద్రబాబు సిట్ పేరుతో సాక్షులను ప్రభావితం చేస్తున్నారని మేయర్ ఆరోపించారు. సిట్ పేరుతో జ్యూడిషియల్, పోలీస్ సమక్షంలో జనార్దన్‌రావుతో కట్టు కథను అల్లుతున్నారని విమర్శించారు. మాజీ మంత్రి జోగి రమేష్‌కి అంటగట్టేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. నకిలీ మద్యం కేసును సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. నిజాలను వెలికి తీసుకువస్తున్న సాక్షి మీడియాపై అక్రమ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. సాక్షి టీవీ, పేపర్‌పై అక్రమ కేసులు నమోదు చేసి భయపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారన్నారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు

గడివేముల: రబి సీజన్‌లో పప్పు శనగ విత్తనాలు ఆయా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు ఏఓ పవన్‌కుమార్ బుధవారం తెలిపారు. శనగ క్వింటా ధర రూ.7800 ఉండగా 25 శాతం సబ్సిడీపై రూ.5850 చెల్లించాలని సూచించారు. మండలానికి 125 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు చెప్పారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ మెట్ట సమీపంలో కేశవరెడ్డి పాఠశాల వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. గుడుంబాయి తండాకు చెందిన శ్రీనివాసనాయక్ బైక్‌పై వెళ్తూ ముందు వెళ్లే బైక్‌ను ఢీకొనడంతో గాయాలైనట్లు చెప్పారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.

పాఠశాలల సమయానికి విద్యార్థి బస్సు నడపాలి

కోడుమూరు రూరల్ : గూడూరులో పాఠశాలలు, కాలేజీల సమయానికి విద్యార్థి బస్సును నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు ఖాజావలి కోరారు. మంగళవారం గూడూరులో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఖాజావలి మాట్లాడుతూ గూడూరులోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో చదువుకునేందుకు ప్రతి రోజు చుట్టు పక్కల గ్రామాల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు వస్తుంటారన్నారు. అయితే పాఠశాలకు వచ్చి వెళ్లే సమయాల్లో విద్యార్థి బస్సు నడపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి పాఠశాల సమయానికి విద్యార్థి బస్సు నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శేఖర్, ధనుష్, మనోహర్, రాఘవగౌడ్ పాల్గొన్నారు.

పీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

కల్లూరు: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేద్దామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు నగరం మాధవి నగర్‌లోని స్థానిక కార్యాలయంలో నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తమాల అశోక్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు, కూటమి పార్టీల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

జంతువులను రోడ్లపైకి వదిలితే జరిమానా

కర్నూలు టౌన్: నగరంలో పందులు, ఆవులు, గాడిదలు, గేదెలను పెంచుకుంటున్న యజమానులు వాటిని రోడ్లపైకి వదిలితే జరిమానా విధిస్తామని నగర పాలక ఆరోగ్యశాఖ అధికారి విష్ణుమూర్తి మంగళవారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరిక చేశారు. జంతువులు ప్రధాన రహదారుల్లో, రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. తద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు.

రోడ్డుపైనే వాహనాలు

గడివేముల: గడివేముల-నంద్యాల రహదారిలోని గ్రంధివేముల గ్రామం వద్ద వాహనాలు రోడ్డుపైనే నిలుపుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో రోడ్డు పక్కనే పంక్చర్ దుకాణాలు ఉన్నాయి. పంక్చర్ల కోసం వచ్చిన భారీ వాహనాలు రోడ్డు పైనే నిలుపుతుండటంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. సమీపంలోనే జిందాల్ సిమెంట్‌ఫ్యాక్టరీ ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రివేళల్లో వాహనాలు కనపడకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. ప్రతినిత్యం మండలస్థాయి అధికారులు ఇదే రోడ్డుపైనే తిరుగుతున్న పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. అలాగే బూజునూరు బాట నుంచి నంద్యాల వరకు రోడ్డు పక్కనే పంక్చర్ బంకులు ఉండటంతో రోడ్డుపై భారీ వాహనాలు నిలిపి రోజుల కొద్దీ రిపేర్లు చేసుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధింత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపైనే అడ్డంగా నిలిపిన భారీ వాహనాలు

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

కర్నూలు(హాస్పిటల్): ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణం కాపాడే అవకాశం ఉందని ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శారద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం చెప్పారు. సీపీఆర్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీలో అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనెస్తీషియా వైద్యులు, టెక్నీషియన్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(అర్బన్): మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రెనింగ్ కొరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ట్రెనింగ్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదురు పద్మాకర్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల మేరకు డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో నవంబర్ 15వ తేదీన సెలక్షన్ జాబితాను ప్రచురిస్తారని, 21వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

ఆర్‌యూసీఈలో వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం



ఆర్‌యూ వీసీకి మొక్కను అందజేస్తున్న కటికె గౌతమ్, తదితరులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె గౌతమ్ విమర్శించారు. మంగళవారం వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయ్‌కుమార్ నాయుడులను మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలను వారితో ప్రస్తావించారు. వర్సిటీలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంజినీరింగ్ కళాశాలకు నిధులు, నియామకాలతో నాణ్యమైన విద్యను అందించారన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి కొత్త కోర్సులను ప్రవేశ పెడితే ప్రస్తుతం ల్యాబ్‌లు, టీచింగ్ ఫ్యాకల్టీని ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. సంవత్సరం కావస్తున్నా రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించుకోలేక పోవడం విచారకరమన్నారు. పూర్తి స్థాయిలో ఫ్యాకల్టీ, మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘం నాయకులు తిరుమలేష్, ఏజెస్, హుస్సేన్, గార్గేయపురం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బైరెడ్డి కోటిరెడ్డి, కర్నూలు మండల ప్రచార విభాగం అధ్యక్షుడు పల్లె నాగిరెడ్డి, సోషల్ మీడియా విభాగం కార్యదర్శి గడ్డం శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల సాహిత్య పురస్కారం ప్రదానం

కర్నూలు కల్చరల్: సి.బెళగల్ మండలం పోలకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ బాల సాహితీవేత్త పుల్లా రామాంజనేయులు సింహప్రసాద్ సాహిత్య సమితి వారి డాక్టర్ వేదగిరి రాంబాబు బాల సాహిత్య పురస్కారం -2025ను అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం పూర్వ సలహాదారు కె.వి.రమణాచారి, సమితి కన్వీనర్ సింహప్రసాద్, సభ్యులు కథా రచయితలు విహారి, వాణిశ్రీ, సుధామ ప్రదానం చేశారు.. పురస్కారం కింద రూ.5 వేలు నగదు, మెమొంటోను అందజేసి ఘనంగా సత్కరించారు. ఏటా బాల సాహిత్యంలో విశేష కృషి చేసిన వారికి పురస్కారం అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పురస్కారం అందుకున్న రామాంజనేయులుకు పలువురు సాహితీ వేత్తలు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న పుల్లా రామాంజనేయులు